క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కొండాపూర్ ఏఈ రాజశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మసీద్‌బండ విలేజ్, ప్రభుపాద టౌన్‌షిప్, రిలయన్స్ అపార్ట్‌మెంట్స్ పరిసరాలు మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు శ్రీరాంనగర్ సీ బ్లాక్, మసీద్‌బండ గవర్నమెంట్ స్కూల్ పరిసరాలు, మై హోం మంగళ రోడ్ తదితర ప్రాతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మియాపూర్‌లో..

మియాపూర్: అల్లాపూర్ సొసైటీ, సెవెన్ హిల్స్ ఫీడర్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ హరిసింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు అల్లాపూర్ సొసైటీ ఏరియా, బీఎస్ఎన్ఎల్ ఆఫీస్, సెవెన్‌హిల్స్ అపార్ట్‌మెంట్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 120, పచ్చిమిర్చి 90, బెండ 45, కాకర 55, దొండ 35, దోస 30, ఆలు 25, చామ 45, కీర 30, బీర 50, వంకాయ 35, గోకర 45, బీన్స్ 120, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 70, క్యాబేజీ 25, క్యారెట్ 70, చిక్కుడు 80, ఉల్లి 100 (4 కేజీలు), ములక్కాయలు (3) 20 , క్యాలీఫ్లవర్ (1) 30 సొరకాయ (కేజీ) 30, అల్లం 320, వెల్లుల్లి 220–250.

కొవిడ్ టెస్టులు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం 16 మందికి కొవిడ్ ర్యాపిడ్ యాంటీజెన్ టెస్టులు నిర్వహించగా నెగిటివ్ వచ్చిందని నిర్వాహకులు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు 14 మందికి నిర్వహించినట్లు తెలిపారు.

డిజైర్ డిజైనర్ ఎగ్జిబిషన్ ప్రారంభం



మాదాపూర్: మాదాపూర్ ఎన్ కన్వెన్షన్ సెంటర్‌లో మూడురోజుల పాటు నిర్వహించనున్న డిజైర్ డిజైనర్ ఎగ్జిబిషన్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకురాలు అనిత అగర్వాల్ మాట్లాడుతూ పలువురు డిజైనర్లు రూపొందించిన ప్రత్యేక డిజైన్‌లు, వివాహాది శుభకార్యాలకు వివిధ రకాల వస్త్రాలు, ఆభరణాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో పలువురు మోడల్స్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

పటాన్‌చెరు టౌన్: గుర్తుతెలియని ఓ మహిళ మృతదేహం లభ్యమైంది. అమీన్‌పూర్ ఎస్ఐ కిష్టారెడ్డి కథనం ప్రకారం...అమీన్‌పూర్ పరిధిలోని శివసాయినగర్ కాలనీ సమీపంలోని దినేష్ హోమ్స్ పక్కన గల నాలాలో ఓ మహిళ (25–30) మృతదేహం శుక్రవారం కనిపించింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించగా మృతురాలి ఎడమ చేతిపై మధు, అంజి, అమ్మ అని పచ్చబొట్టును పోలీసులు గుర్తించారు. మృతురాలి తాళిబొట్టు, రూ.20, 10 నోట్లు, మేరాజ్ ఖైని ప్యాకెట్ పోలీసులకు లభించాయి.మృతురాలికి సంబంధించిన బంధువులు ఎవరైనా ఉంటే పోలీస్‌స్టేషన్ ను సంప్రదించాలన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యం



హెచ్ఎంటీ స్వర్ణపురి కాలనీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ తదితరులు

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

మియాపూర్ : శేరిలింగంపల్లి నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. చందానగర్ డివిజన్ పరిధిలోని హెచ్ఎంటీ స్వర్ణపురి కాలనీలో రూ.35 లక్షల వ్యయంతో నూతనంగా చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు కార్పొరేటర్ మంజులరఘునాథ్‌రెడ్డితో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం నాగప్రియ, మేనేజర్ సాయిచరిత, గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ గణేష్ ముదిరాజ్, చందానగర్ డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

◆ బోనాల పండగ చెక్కుల పంపిణీ

ఆల్విన్‌కాలనీ: బోనాల జాతరకు 90 దేవాలయాలకు ప్రభుత్వం మంజూరు చేసిన 25 లక్షల 80 వేల రూపాయల చెక్కులను కమిటి ప్రతినిధులకు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లతో కలిసి శుక్రవారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలో వాడవాడలా వేడుకలను వైభవంగా జరుపుకోవాలనే ఉద్దేశ్యంతో ప్రతి గుడికి నిధులు మంజూరయ్యేలా కృషి చేశానని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్‌గౌడ్, జూపల్లి సత్యనారాయణ, ఉప్పలపాటి శ్రీకాంత్, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ గణేష్ ముదిరాజ్, మాజీ కౌన్సిలర్ మోహన్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డుపై నీరు నిలువకుండా చర్యలు

కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ డివిజన్ పరిధిలోని దత్తాత్రేయ కాలనీలోని వీధిలో వర్షపు నీరు నిల్వ ఉంటోందని కాలనీవాసులు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన శుక్రవారం ఆ ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో సీసీ రోడ్డు వేసి సమస్యను పరిష్కరిస్తానని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. అదే విధంగా భవిష్యత్తులో వర్షపు నీరు నిలిచే సమస్య తలెత్తకుండా సీసీ రోడ్డు ఎత్తు పెంచి ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి గుడ్ల శ్రీనివాస్, రాములు గౌడ్, జగదీష్, కుర్మయ్య, మోసిన్, సర్దార్, నరసింహ గౌడ్, హనుమంత్ రెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



దత్తాత్రేయ కాలనీలో సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

200 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

పటాన్‌చెరు టౌన్: అక్రమంగా తరలిస్తున్న 200 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పటాన్‌చెరు పోలీసులు పట్టుకున్నారు.ఎస్ఐ రామానాయుడు, సివిల్ సప్లై అధికారులు తెలిపిన వివరాలు... పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామ శివారులోని రిమ్,జిమ్ దాబా వద్ద పటాన్‌చెరు పోలీసులు విశ్వసనీయ సమాచారం మేరకు రేషన్ బియ్యం లారీని పట్టుకున్నారు.లారీ డ్రైవర్ దినేష్ పోలేను పోలీసులు అదుపులో తీసుకున్నారు. సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల నుండి నాందేడ్‌కు తరలిస్తున్న బియ్యం లారీని పౌర సరఫరాల గోదాంకు తరలించారు. పటాన్‌చెరు డీటీసీఎస్‌లు విష్ణువర్ధన్, దినేష్‌రెడ్డిల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



రేషన్ బియ్యం లారీని సీజ్ చేసిన అధికారులు

మహిళలు అప్రమత్తంగా ఉండాలి

● మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): చైన్ స్నాచింగ్‌ల నివారణకు ప్రతి ఒక్కరు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి కోరారు. శుక్రవారం రామచంద్రాపురం పట్టణంలో చైన్‌స్నాచింగ్‌లపై ప్రజలలో అవగాహన కల్పించేందుకు ప్రచార వాహనాన్ని ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు మార్కెట్‌కు, ఒంటరిగా బయటకు వెళ్ళే సమయంలో ఎక్కువగా బంగారు ఆభరణాలను ధరించ వద్దని సూచించారు. అదే విధంగా ప్రయాణ సమయంలో సైతం తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మహిళలు మెడలోని బంగారు ఆభరణాలు కనిపించకుండా కొంగు కప్పుకోవాలని చెప్పారు. కొంత మంది అడ్రస్ అడిగినట్లు నటిస్తూ గొలుసులను తెంచుకొని పారిపోతున్నారని అప్రమత్తంగా ఉండాలన్నారు. కాలనీలో ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మియాపూర్ ఏసీపీ పి.నరసింహారావు, ఎస్ఐ శశికాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

జడ్సీని కలిసిన బీజేపీ నాయకులు

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ బి.శ్రీనివాస్ రెడ్డిని శుక్రవారం వెస్ట్ జోనల్ కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.రవికుమార్ యాదవ్, నాయకులు కలిశారు. తమ దృష్టికి వచ్చిన ప్రజా సమస్యలను పరిష్కరించాలని జోనల్ కమిషనర్‌ను కోరారు. కార్యక్రమంలో గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి, రాధాకృష్ణ యాదవ్, ఆంజనేయులు సాగర్, అనిల్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు హైటెక్స్‌లో హైదరాబాద్ డెంటల్ షో

మాదాపూర్: మాదాపూర్‌లోని హైటెక్స్‌లో హైదరాబాద్ డెంటల్ షోను ప్రారంభించనున్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో దేశవ్యాప్తంగా దంత నిపుణులు పాల్గొననున్నారు.రెండు రోజుల పాటు నిర్వహించనున్న ప్రదర్శనలో ప్రాక్టీషనర్లు, విద్యావేత్తలు, విద్యార్థులు, డెంటల్ ఎక్విప్‌మెంట్, మెటీరియల్, ల్యాబ్‌లు, తయారీదారులు ఈ ప్రదర్శనలో పాల్గొననున్నారు.

రేపు శాంతిసరోవర్‌లో అడ్మినిస్ట్రేటర్స్ సెమినార్

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్ గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో ఆదివారం 'అడ్మినిస్ట్రేటర్స్ సెమినార్' నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. బ్రహ్మకుమారీస్ అడ్మినిస్ట్రేటర్స్ వింగ్ ఆధ్వర్యంలో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో 'వాల్యూస్ అండ్ స్పిరిచ్యువాలిటీ ఫర్ బెటర్ గవర్నెన్స్' అనే అంశంపై ప్రత్యేక సెమినార్‌ను నిర్వహిస్తారు. ఈ సెమినార్‌లో న్యూఢిల్లీ అడ్మినిస్ట్రేటర్స్ వింగ్ చైర్‌పర్సన్ రాజయోగిని బీకె ఆషాదీదీ కీలకోపన్యాసం చేస్తారు. పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఆధార్‌సిన్హా, రాష్ట్ర నీటిపారుదల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రజత్‌కుమార్, రెరా చైర్మన్ డాక్టర్ ఎన్ సత్యనారాయణ పాల్గొంటారు. కార్యక్రమంలో పాల్గొనేవారు తమ పేర్లను ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అందుకోసం వెబ్‌సైట్ www.shantisarovar.orgలో నమోదు చేసుకోవాలి.

మృతదేహం లభ్యం

మాదాపూర్: ప్రేమ విఫలమై మాదాపూర్‌లోని కేబుల్‌బ్రిడ్జిపై నుండి దుర్గం చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న పాయల్(20) మృతదేహం లభ్యమైంది. శుక్రవారం మధ్యాహ్నం 12గంటల సమయంలో మృతదేహాన్ని డీఆర్ఎఫ్, ఫైర్ సిబ్బంది వెలికితీశారు. పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. చెరువు మధ్యభాగంలో దాదాపు 40 అడుగుల లోతు, బురదతో ఉండడంతో కూరుకుపోయినట్టు లేక్ పోలీసులు తెలిపారు.

'జాతి నిర్మాణంలో రాక్ ఇంజనీరింగ్'పై సదస్సు

పటాన్‌చెరు టౌన్: జాతి నిర్మాణంలో రాక్ ఇంజనీరింగ్ పాత్ర అనే అంశంపై ఈనెల 18న గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలో చర్చాగోష్ఠి జరగనుంది. ఆత్మనిర్భర్ భారత్ అభియాన్‌లో భాగంగా, భారత గనుల మంత్రిత్వశాఖ పర్యవేక్షణలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్ (ఎన్ఎస్ఐఆర్ఎం) సౌజన్యంతో దీనిని నిర్వహిస్తున్నట్టు ప్రొఫెసర్ మాధవి శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ వీ.ఆర్.శాస్త్రితో పాటు ఎస్ఐఆర్ఎం డైరెక్టర్ డాక్టర్ హెచ్.ఎస్.వెంకటేష్, పలువురు శాస్త్రవేత్తలు పాల్గొంటారన్నారు. సొరంగాలు, భూగర్భ గుహలు, తవ్వకాల ప్రాజెక్టులు, అణు విద్యుత్ , జల విద్యుత్ ప్రాజెక్టులు మొదలైన వాటిలో అవలంబిస్తున్న కొత్త సాంకేతికతలకు సంబంధించిన కేస్ స్టడీలను ఈ కార్యక్రమంలో ప్రదర్శించనున్నట్టు డాక్టర్ మాధవి తెలిపారు. ఇతర వివరాల కోసం డాక్టర్ అరిజిత్ సాహా (70056 40623)ని సంప్రదించాలని తెలిపారు.

పేద విద్యార్థులకు చేయూతనివ్వాలి



విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందిస్తున్న కమాండెంట్ మురళీకృష్ణ, భిక్షపతి యాదవ్

గచ్చిబౌలి: పేద విద్యార్థుల చదువుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కొండాపూర్ టీఎస్ఎస్‌పీ 8వ బెటాలియన్ కమాండెంట్ పి.మురళీకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం కొండాపూర్, మసీద్‌బండ ప్రభుత్వ పాఠశాలల్లో సందయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాదానం మహాదానం అని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే ఎం.భిక్షపతి యాదవ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నతస్థాయికి ఎదగాలని, కష్టపడి చదివితే కలలను సాకారం చేసుకోవచ్చని విద్యార్థులకు సూచించారు. సందయ్య మెమోరియల్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గోవింద్, రాధాకృష్ణ, సదానంద్ యాదవ్, నర్సింహ్మ యాదవ్, నీలం కృష్ణ, వినోద్‌రావు, సుమన్, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయ స్పోర్ట్స్ మీట్-2023 ప్రారంభం



ప్రారంభమైన బ్యాడ్మింటన్ పోటీలు

రాయదుర్గం: విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని గచ్చిబౌలి కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ జితేంద్రకుమార్ సూచించారు. గచ్చిబౌలి జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని కేంద్రీయ విద్యాలయ ఆధ్వర్యంలో రీజనల్ స్థాయి స్పోర్ట్స్ మీట్-2023 బాలుర బ్యాడ్మింటన్ పోటీలను గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ఇండోర్ స్టేడియంలో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీలలో 127 మంది విద్యార్థులు, హైదరాబాద్ రీజియన్ పరిధిలోని 36 కేంద్రీయ విద్యాలయాల నుంచి పాల్గొంటున్నారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, కోచ్‌లు, విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

సంస్కృతికి ప్రతీక బోనాలు

పటాన్‌చెరు టౌన్: తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ అన్నారు. పటాన్‌చెరు పట్టణం బండ్లగూడ గ్రామంలో నిర్వహించిన బోనాల మహోత్సవానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు ఆయనని ఘనంగా సత్కరించారు. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జంగయ్య, సత్య, శ్రీశైలం,భాస్కర్, శ్రీను, బాల్‌రాజ్, శ్రీను, కిషోర్, మధు, కృష్ణ, సాయి, జాతర నిర్వాహకులు, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

అకారణంగా ఉద్యోగాల నుంచి తొలగించారని ఆందోళన



మాట్లాడుతున్న బాధిత మహిళ దేవిక

పంజగుట్ట: మాదాపూర్‌లోని అర్బన్ కంపెనీలో బ్యూటీ సర్వీస్‌లో విధులు నిర్వహిస్తున్న తమను అకారణంగా, ఎలాంటి సమాచారం లేకుండా ఉద్యోగాల నుండి తొలగించారని తమకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బాధిత మహిళలు వేడుకున్నారు. శుక్రవారం ఉదయం సుమారు 15 మంది మహిళలు ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రిని కలిసి తమ సమస్య చెప్పుకుంటామని వెళ్లగా అక్కడి సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకుని మాదాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని పంపించారు. అనంతరం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో బాధిత మహిళలు దేవిక, పూజ, యశోద, మీనాక్షిలు మాట్లాడుతూ... అర్బన్ కంపెనీలో బ్యూటీ, మేకప్, నెయిల్ ఆర్ట్స్ సర్వీసుల్లో గత ఐదు సంవత్సరాలుగా చేస్తున్నామని తెలిపారు. తాము ఉద్యోగంలో చేరే సమయంలో కిట్‌కోసం 40 వేలు తీసుకుని 10 రోజులు శిక్షణ ఇచ్చి, సంతకాలు తీసుకుని విధుల్లో చేర్చుకున్నారని తెలిపారు. చేరే సమయంలో మీరు మా ఉద్యోగులు కాదు, కానీ మీకు తెలియకుండా సంస్థ ఎలాంటి నిర్ణయాలు తీసుకోదని నమ్మబలికారన్నారు. ఇప్పుడు ఏ కారణంలేకుండా మా ఐడీలు బ్లాక్ చేస్తున్నారని తమ స్థానంలో కొత్తవారిని పెట్టుకుని వారి నుంచి తిరిగి రూ. 40 వేలు వసూలు చేసేందుకు మమ్మల్ని ఉద్యోగాల నుండి తీసేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు సుమారు 6 వేల మందిని తొలగించారని ఇదేమిటి అని అడిగేందుకు ఆఫీసుకు వెలితే బౌన్సర్లు, పోలీసులతో లోనికి రానివ్వడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాదాపూర్ పోలీసులకు కూడా పలుమార్లు ఫిర్యాదు చేశామని వారు పట్టించుకోవడం లేదన్నారు. గట్టిగా నిలదీస్తే బెదిరింపు కాల్స్, అసభ్య మెసేజ్‌లు పంపుతున్నారని తెలిపారు. కాగా గతంలో తమకు బ్యూటీప్యార్లర్లు ఉండేవని వాటిని మూసివేసి ఇందులో చేరామని, నేడు అకారణంగా తొలగించారని ఇప్పుడు మా పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. తమ ఐడీలు వెంటనే అన్‌లాక్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామన్నారు.